క్లుప్తంగా

శాంతిభద్రతలో పోలీసుల పాత్ర కీలకం



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కె.కోటపాడు: శాంతి భద్రతల కల్పనలో పోలీసుల పాత్ర ఎనలేనిదని ఎ.కోడూరు ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. పోలీస్ అమర వీరుల దినం పురస్కరించుకొని గురువారం ఎ.కోడూరు హైస్కూల్ విద్యార్థులకు సమాజంలో పోలీసుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ పోలీస్ అమర వీరుల సంస్మరణ దిన వారోత్సవాలు ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసులకు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఎస్ఐ నివాళులర్పించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల రూరల్: చీడికాడ మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె. జయప్రకాష్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షత వహించే ఈ సమావేశానికి మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

రోడ్డుకు ఇరువైపులా తుప్పల తొలగింపు



తుప్పలను తొలగించే పనులను పర్యవేక్షిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

కె.కోటపాడు: వర్షాకాలంలో రోడ్లను కప్పేస్తున్న తుప్పలను తొలగించడానికి గ్రామస్తులు బాధ్యత తీసుకోవాలని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ కోరారు. చౌడువాడలో మల్లిలమ్మ ఆలయం నుంచి పాచిలవానిపాలెం, జి.జగన్నాథపురం గ్రామాల రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు, డొంకలను గురువారం జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ పనులను ఆయన తన సొంత నగదుతో చేయించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శ్రమదాన స్ఫూర్తితో ఈ చర్యలను చేపట్టినట్లు ఆయన తెలిపారు. వార్డు మెంబర్ గండి సత్యం, పాల సంఘం అధ్యక్షుడు సిరపరపు రమణారావు, రొంగలి శ్రీరామ్మూర్తి, బంటు జలంధర్ పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాలపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: విద్యార్థులకు ఖాదీ వస్త్రాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ సమగ్ర శిక్ష ఆదేశాలతో ఖాదీ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థి మోహన్ విజేతగా నిలిచినట్టు హెచ్ఎం కోసూరు రాము తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోగస్ డ్వాక్రా గ్రూపు దోపిడీపై చర్యలు తీసుకోవాలి

తుమ్మపాల: మండలంలో సత్యనారయణపురం గ్రామంలో బోగస్ డ్వాక్రా గ్రూప్ ఏర్పాటుచేసి భారీగా సొమ్మును కాజేసిన వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలిపారు. మహిళల వివరాలను సేకరించి వారికి తెలియకుండా రుణం తీసుకుని, కాజేశారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆరోపించారు. ఒక్కో గ్రూప్ నుంచి రూ.15 లక్షల చొప్పున మొత్తం 6 గ్రూపుల నుంచి నగదును నొక్కేసినట్లు పేర్కొన్నారు. ముద్ర రుణాలను కూడా వీరు అడ్డగోలుగా కాజేశారని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన వెలుగు సిబ్బందిపై విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



చోడవరం: వైద్యులతో మాట్లాడుతున్న విప్ కరణం ధర్మశ్రీ



కె.కోటపాడు: పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న అనురాధ, జగన్‌మోహన్



మాడుగులలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- జగనన్న ఆరోగ్య సురక్షలో విశేష వైద్య సేవలు
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. పీఎస్‌పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో 340 మందికి స్పెషలిస్టు వైద్యులు పరీక్షించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బండారు సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన సదుపాయాలు, వైద్య పరికరాలు లేక పూర్తిస్థాయిలో వైద్యం అందేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రులన్నీ ఆధునికీకరించడంతోపాటు అంబులెన్సుల వైద్య సేవలు మరింత ఎక్కువగా విస్తరించారన్నారు. ఆధునిక, మెరుగైన వైద్యాన్ని పేదలందరికీ అందించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చి అన్ని రకాల శస్త్రచికిత్సలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ తిరుమలబాబు, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, పంచాయతీ ఈవో నారాయణరావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఎంపీటీసీలు పుట్రేవు శ్యామ్‌ప్రసాద్, లక్ష్మి, వార్డు మెంబర్లు కోటేశ్వరరావు, చవితిన బాబూరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు పాల్గొన్నారు.

మంచంపై రోగులకు వైద్య సేవలందించండి

బుచ్చెయ్యపేట/రోలుగుంట: మంచంపై రోగులను ఆటోలు, ఇతర వాహనాల ద్వారా తీసుకొచ్చి పూర్తి స్థాయిలో వైద్య సేవలందించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బుచ్చెయ్యపేట మండలం తైపురం, రోలుగుంట మండలం బల్జిపాలెం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పరిశీలించారు. బల్జిపాలెంలో గ్రామస్తులతోపాటు కశిరెడ్డిపాలెం, గుర్రాలపాలెం గ్రామాల నుంచి వచ్చిన 394 మంది రోగులను రోలుగుంట, బూరుగపాలెం పీహెచ్‌సీల వైద్యులు శ్రావణి, సాయి చరణ్, విశాఖ నుంచి వచ్చిన వీఆర్కే శ్రావణి, మరో ఇద్దరు వైద్యులు పలు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సిబ్బంది స్వయంగా తయారు చేసిన పోషకాలు కలిగిన పిండి వంటలు, పండ్ల స్టాల్‌ను, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను ప్రదర్శించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు ముచ్చకర్ల శ్రీను,



బుచ్చెయ్యపేట: వైద్య శిబిరంలో రోగితో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

గోపిశెట్టి శ్రీను, మామిడి అప్పలనర్స నాయకులు మరిసా రమణ, డేగల అప్పారావు పాల్గొన్నారు.

నేడు నిండుగొండలో..

రోలుగుంట: నిండుగొండలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపీడీవో ప్రభాకరరావు తెలిపారు. కార్పొరేట్ వైద్యశాలలో నిర్వహించే ఖరీదైన రోగ పరీక్షలు ఇక్కడ ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సురక్షతో మెరుగైన వైద్యం

కె.కోటపాడు: ప్రజల చెంతకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా మెరుగైన వైద్యం అందనున్నట్లు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్ అన్నారు. గురువారం మేడిచర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో రోగుల రిజిస్ట్రేషన్, మందుల వివరాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు ఇప్పటి వరకూ వివక్ష లేకుండా సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం జగన్ ప్రస్తుతం అందరినీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడానికి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. వైద్య శిబిరంలో మేడిచర్ల, ఎ.భీమవరం, బోకంవానిపాలెంకు చెందిన 369 మందిని పరీక్షించినట్టు నిర్మల, సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపీడీవో కె.శచీదేవి, ఎంఈవో డీవీడీ ప్రసాద్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టరు ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు, పూడి నారాయణమూర్తి, తర్రా శేషు, జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, శ్రీకాంత్ శ్రీను పాల్గొన్నారు.

అప్పుల పాలు కాకూడదని

మాడుగుల: నిరుపేదలు ఆరోగ్యపరంగా అప్పుల పాలు కాకూడదని ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తున్నారని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. గురువారం మాడుగులలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఐడీడీఎస్ పీవో శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సుగుణ, పి. మౌనిక, రాజకుమార్ 370 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పంచాయతీ ఈవో నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ దేవరాపల్లి శ్రీనివాసరావు, పీహెచ్‌వో పుష్ప, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఏఎన్‌ఎం, వరలక్ష్మి, వరలక్ష్మి, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

నేడు జి. అగ్రహారంలో...

మాడుగుల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జి. అగ్రహారం హైస్కూలులో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మీనాకుమారి గురువారం తెలిపారు. వడ్డాది పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్. మౌనిక సారథ్యంలో వైద్య సేవలందిస్తారని, సచివాలయ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గ్రామ స్వరాజ్య పాలన జగనన్నతోనే సాధ్యం

- తైపురంలో ఆర్బీకే, హెల్త్ సెంటర్‌లను ప్రారంభించిన విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం తైపురంలో రూ.40 లక్షలతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మండల స్థాయిలో సేవలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. రైతులకు విత్తనాలు, పురుగులు మందులు అందించడంతోపాటు పండించిన పంటను గ్రామంలోనే



తైపురంలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

అమ్ముకోవాలని రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. పింఛన్, రేషన్ కార్డు, ఆధార్, ఇంటి స్థలం, ఇల్లు తదితర వాటి కోసం మండల కేంద్రాల చుట్టూ తిరగకుండా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలందిస్తున్నారన్నారు. గ్రామంలోనే ఆరోగ్య సేవలు అందేలా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. గతంలో జిల్లా, మండల కేంద్రాల్లోనే అయ్యే పనులు నేడు గ్రామ స్థాయిలోనే పరిష్కారమవుతున్నాయన్నారు. బుచ్చెయ్యపేట మండలంలోని 35 పంచాయతీల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఉపయోపడేలా వినియోగంలోకి తీసుకురావాలని మండల అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు ముచ్చకర్ల శ్రీను, బుదిరెడ్ల ఈశ్వరరావు, మరిసా నాగమణి, మాజీ సర్పంచ్ డేగల అప్పారావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అనారోగ్యంతో బాధపడుతున్న గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం పంచాయతీ శివారు కసిమి గ్రామానికి చెందిన శిరంరెడ్డి బాలవెంకట గంగాధర్‌కు సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం అందజేశారు. గంగాధర్ తండ్రి వరహాలు వైఎస్సార్‌సీపీ నాయకుడిగా సేవలందిస్తున్నారు. కుమారుడి అనారోగ్య విషయమై తండ్రి వరహాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, గొలుగొండ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న బృందం

చోడవరం రూరల్: పట్టణ శివారు పీఎస్ పేటలో గురువారం మరిడిమాంబ పండగ ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ అమ్మవారి గుడిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.



మరిడిమాంబ అమ్మవారు

అమ్మవారిని ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పసుపు కుంకుమలతో పూజించారు. సాయంత్రం అమ్మవారి జాతర పలు సాంస్కృతిక ప్రదర్శనలతో బాణసంచా పేలుళ్లతో సందడిగా సాగింది. భక్తులకు పాచిల సతీష్ ఫ్రెండ్స్ బృందం సమకూర్చిన ప్రసాదాలను పంచిపెట్టారు.

2న బస్సు యాత్ర విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నాయకులు యర్రా అప్పారావు, సుంకర శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: మాడుగులలో వచ్చే నెల 2న నిర్వహించే సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, పార్టీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీనివాసరావు కోరారు. చీడికాడ మండల పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం గురువారం ఉదయం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ 35 మాసాల్లో సామాజిక విప్లవాన్ని సంక్షేమ అభివృద్ధిని వివరించేందుకు ఇచ్ఛాపురంలో సామాజిక సాధికారిత బస్సు యాత్ర ప్రారంభమైందన్నారు. వచ్చే నెల మాడుగుల నియోజకవర్గంలో ప్రవేశించనున్న ఈ యాత్రకు మండలం నుంచి ఐదు వేలు మందికి మించకుండా పార్టీ శ్రేణులు, అభిమానులు, సంక్షేమ లబ్ధిదారులు హాజరు కావాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు మాట్లాడుతూ ఆరోజు మధ్యాహ్నం 2 గంటల కల్లా కార్యకర్తలు, నాయకులు వాహనాల్లో మాడుగులకు చేరుకోవాలన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి వచ్చే వాహనాలు అప్పలరాజుపురం చెరకు కాటా వద్దకు చేరుకుని, అక్కడ నుంచి ఊరేగింపుగా మాడుగులకు బయలుదేరుతామన్నారు. మండల యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి సోమినాయుడు, ఎంపీపీ భర్త కురచా నారాయణమూర్తి, దండిసురవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నందరావు రమణబాబు, టౌన్ అధ్యక్షుడు పరువాడ మహేష్ మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ నిమజ్జనోత్సవం

మాకవరపాలెం: మండల కేంద్రంలో దుర్గమ్మ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. బీసీ కాలనీలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గమ్మ ప్రతిమలను బుధవారం రాత్రి గ్రామంలో ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు. కొత్తవీధిలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాన్ని గురువారం రాత్రి అన్ని వీధుల్లోనూ వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.

వరి పంటలో తెగుళ్ల నివారణ



వరిపంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు



పొలాలను పరిశీలిస్తున్న ఏవో విజయలక్ష్మి

రోలుగుంట: మండలంలో ఖరీఫ్ వరి పంటలను ఏవో ఎస్. విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. కొవ్వూరు, వడ్డిప, శరభవరం తదితర గ్రామాల్లో వర్షభావంతో పొలాన్ని ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించారు. అధికంగా సుడిదోమ, ఆకుముడత తెగుళ్లున్నట్టు గుర్తించి నివారణకు పలు సూచనలు, సలహాలు రైతులకు అందజేశారు. క్రిమిసంహారక మందుల దుకాణాల వద్ద వారిచ్చిన మందులు పిచికారీ చేస్తే నివారణ కన్నా తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశముందన్నారు. సుడిదోమకు పిలక దశలో తాడు వేసుకోవాలని, ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలు తీయాలని, పొలాన్ని అడపాదడపా ఆరబెట్టుకోవాలని, ఎనిమిది కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గులికలు చల్లుకోవాలని సూచించారు. ఎకరాకి ఎసిపేట్ 300 గ్రాముల 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత పురుగు ఎక్కువగా ఉంటే ఎమామెక్టిన్ బెంజోయేట్ పొడి మందు ఎకరాకు వంద గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో గ్రామ స్థాయి సహాయ వ్యవసాయాధికారిని గాని, మండల వ్యవసాయ కార్యాలయంలో సిబ్బందిని కాని సంప్రదించి వారి సూచనలు, సలహాలు తీసుకోవాలని వివరించారు.

వరి పంటను వెంటాడుతున్న తెగుళ్లు

మాకవరపాలెం: వరి సాగుకు తెగుళ్లు వెంటాడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌తో 1,250 హెక్టార్లలో వరిసాగు చేపట్టారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిపంటకు ఆకుముడత, సుడిదోమ తెగుళ్లు ఆశించాయి. మండల వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో పంటకు తెగుళ్లు సోకినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆకుముడత నివారణకు కార్టా హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు, లేదా ఎసిపేట్ ఒక గ్రాముని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏవో చిరంజీవి తెలిపారు. సుడిదోమ నివారణకు బొప్రొఫెజిన్ మందును పిచికారీ చేయాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



రోలుగుంటలో వ్యాస రచన పోటీలు పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

చోడవరం రూరల్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం గాంధీగ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అమరవీరుల దినం అక్టోబర్ 21 నుంచి సంస్మరణ వారోత్సవాలను ఏటా నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఈ వారోత్సవాలలో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'సామాజిక మాధ్యమాల్లో, ఇతరత్రా చోటు చేసుకుంటున్న సైబర్ నేరాలను అరికట్టడంలో టెక్నాలజీ పాత్ర 'అనే అంశం పట్ల వక్తృత్వ పోటీలు, 'మహిళలు, చిన్న పిల్లలపై చోటు చేసుకుంటున్న శారీరక వేధింపులను అరికట్టడంలో పోలీసుల పాత్ర' అంశం పట్ల వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు చోడవరం ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులను అందజేస్తామన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని తమ ప్రతిభ చూపారు. విజేతలకు ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేస్తామని ఎస్సై సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ క్వారీ కార్మికుడి మృతి

అనకాపల్లిటౌన్: తీవ్రంగా గాయపడిన క్వారీ కార్మికుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గ్రామీణ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామానికి చెందిన రొంగలి అప్పలనాయుడు(62) మండలంలోని కూండ్రం గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహ స్టోన్‌క్రషర్స్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 23న సాయంత్రం 4 గంటల సమయంలో క్వారీలో ఒక యంత్రం ఆగిపోవడంతో అప్పలనాయుడుతోపాటు మరో కార్మికుడు శ్రీనివాసరావు ఆ యంత్రాన్ని తిప్పేందుకు ప్రయత్నించారు. ఒక్కసారిగా యంత్రం తిరగడంతో ఇద్దరు కార్మికులు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో అప్పలనాయుడి తలకు బలమైన గాయమైంది. శ్రీనివాసరావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చగా, మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పలనాయుడు మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుని కుమారుడు నాయుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో అన్నవరంగా సుంకరమెట్ట

అనకాపల్లిటౌన్: మరో అన్నవరంగా సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని తీర్చిదిద్దుతానని ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు అన్నారు. ఆలయ ఆవరణలో గురువారం ప్రహరీ నిర్మాణ స్థలాన్ని పాలకవర్గ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అనంతరం తుప్పల తొలగింపు పనులు చేపట్టారు.